
విద్యార్థులతో చెలగాటం


2


2

వర్షంలోనే కూరగాయల అమ్మకాలు

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in




## బీజేపీ కామారెడ్డి జిల్లా కార్యాలయం ప్రారంభం

**అక్షరటుడే, కామారెడ్డి:** బీజేపీ జిల్లా కార్యాలయాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, నేతలు బీబీ పాటిల్, బాణాల లక్ష్మారెడ్డి, మురళీధర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



## యాసంగిలో విజయవంతంగా ధాన్యం అమ్మకాలు పూర్తి..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** యాసంగిలో విజయవంతంగా ధాన్యం అమ్మకాలు పూర్తి చేశామని తాండూర్ కిచ్చన్నపేట ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు ఆకిడి గంగారెడ్డి తెలిపారు. సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో సంఘం పరిధిలోని 7 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిద్వారా 3,117 మంది రైతుల నుంచి 1,41,532 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. తద్వారా రూ.18.24 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా మార్క్‌ఫెడ్ ద్వారా జొన్నలు 252 మంది రైతుల నుంచి 4,157 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లకు సహకరించిన అధికారులకు, రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వేముల సంగయ్య, విజయ్ కుమార్, సిద్ధిరామ్ రెడ్డి, హనుమా నాయక్, బన్సీ నాయక్, కిషన్ నాయక్, సీఈవో చంద్ర మురళి తదితరులు పాల్గొన్నారు.



## విజయవంతంగా పల్స్‌పోలియో


మిగతా 2వ ఫొటోలు పేజీలో..


**జిల్లాలో గొలుసు దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టపగలు, తెల్లవారుజాము సమయాల్లో తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. గడిచిన ఏడాది కాలంగా జిల్లాలో దొంగతనాల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ముఖ్యంగా చైన్ స్నాచింగ్ ఘటనలు జిల్లా ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గత 12 నెలల్లో జిల్లావ్యాప్తంగా సుమారు 180కి పైగా చోరీలు జరగగా, అందులో 70కి పైగా చైన్ స్నాచింగ్ కేసులే ఉండడం జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోంది.**

- అక్షరటుడే, భీమ్‌గల్



# రెచ్చిపోతున్న గొలుసు దొంగలు

■ జిల్లాలో వరుస ఘటనలు ■ ఆందోళన చెందుతున్న ప్రజలు

జిల్లా కేంద్రంతో పాటు ఆర్మూర్, బోధన్, బాల్కొండ వంటి మండలాల్లోనూ చైన్‌స్నాచింగ్‌లు పెరిగాయి. గత కొద్ది రోజులుగా చోటుచేసుకున్న వరుస ఘటనలే ఇందుకు నిదర్శనం. ఎఫ్‌సీఐ కాలనీలో ఇటీవల తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లిన మహిళ మెడలో నుంచి 5 తులాల బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారు. స్థానికులు కేకలు వేసేలోపే బైక్‌పై మాయమయ్యారు. ఆర్మూర్ పెర్కిట్‌లో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలిని అడ్డగించి, కత్తితో బెదిరించి 3.5 తులాల బంగారాన్ని అపహరించారు.

### బోధన్ ప్రధాన కూడలిలో..

బోధన్ ప్రధాన కూడలిలో రద్దీగా ఉండే రోడ్డుపైనే మహిళ మెడలోని గొలుసును లాక్కెళ్లిన ఘటన స్థానికంగా సంచలనం రేపింది. డిచ్‌పల్లి పరిసరాల్లో ఇంటి ముందు పని చేసుకుంటున్న గృహిణిని గమనించి, ముసుగు వేసుకుని వచ్చి క్షణాల్లో గొలుసును అపహరించిన వైనం నిఘా లోపాలను ఎత్తిచూపింది. తాజాగా బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చైన్ స్నాచింగ్ ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన దుండగుడు అపహరించుకుని పరారయ్యాడు.

### ఎందుకీ వైఫల్యం?

నేరాల నియంత్రణలో పోలీసు యంత్రాంగం అనుసరిస్తున్న తీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రధాన రహదారులపై సీసీ కెమెరాలు ఉన్నా.. నేరం జరిగే అంతర్గత వీధుల్లో కెమెరాలు లేకపోవడం, ఉన్నా పని చేయకపోవడం దుండగులకు కలిసి వస్తోంది. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ వాహనాల సంచారం నామమాత్రంగా మారింది. దీనిని దుండగులు ముందే పసిగట్టి, గస్తీ లేని సమయాలను ఎంచుకుంటున్నారు.

### అంతర్రాష్ట్ర ముఠాల పనేనా..

నేరం చేసిన వెంటనే పక్కనే ఉన్న సరిహద్దుల ద్వారా పరారవుతున్న ముఠాలను పట్టుకోవడంలో నిఘా వ్యవస్థ విఫలమవుతోంది. పాత నేరస్తుల కదలికలపై నిరంతర పర్యవేక్షణ కొరవడింది. అంతర్రాష్ట్ర ముఠాల పనేనని పోలీసు యంత్రాంగం సైతం భావిస్తోంది. కాగా.. కష్టపడి దాచుకున్న బంగారం, ఆభరణాలు క్షణాల్లో దొంగల పాలవుతుండడంపై ఆందోళన చెందుతున్నారు. పోలీసులు గస్తీని పెంచి, కాలనీల వారీగా నిఘాను కట్టుదిట్టం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.



## ప్రధాని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందే..

**అక్షరటుడే, ఇందూరు:** నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ ప్రధాని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్ డిమాండ్ చేశారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం విపుల్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో యువకుల జీవితాలతో ఆడుకుంటూ వారి భవిష్యత్తును నాశనం చేసే విధంగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. నీట్ పేపర్ లీక్ ద్వారా ఎంతో మంది యువకుల జీవితాలు రోడ్లపైకి వచ్చాయని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. యువకులు పెద్ద ఎత్తున ఢిల్లీలో రోడ్లపైకి వచ్చే నిరసనలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం వారిని పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.యువకులకు న్యాయం జరగాలని రాహుల్ గాంధీ వారి పక్షాన 'చాత్రో కి గుంజ్' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. యువకులకు న్యాయం జరిగే వరకూ రాహుల్ గాంధీ పోరాటాన్ని కొనసాగిస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రోషిని జైస్వాల్, జిల్లా యువజన కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వినోద్ ఎర్రంశెట్టి హాజరయ్యారు. యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అద్నాన్, ప్రధాన కార్యదర్శి ఆదిత్య పాటిల్, ఇర్ఫాన్, రాజు గౌడ్, అసెంబ్లీ అధ్యక్షుడు మహేందర్, మొయిన్, యూనుస్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ శ్రీకాంత్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** యువత భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ మండిపడ్డారు. ఏఐసీసీ ఆదేశాల ప్రకారం 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమాన్ని నగరంలోని కాకతీయ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశంలో విద్యార్థులు, యువత భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం జరుగుతున్న పేపర్ లీకేజీలతో విద్యార్థులను, నిరుద్యోగులను కేంద్ర సర్కారు తీవ్రంగా మోసం చేస్తోందని మండిపడ్డారు. 'ఇది కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదు.. దేశ యువత భవిష్యత్తు కోసం ప్రారంభమైన ఒక జాతీయ ఉద్యమం' అని చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలే ప్రధాన ఎజెండాగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పోరాటానికి శ్రీకారం చుట్టారని రామకృష్ణ పేర్కొన్నారు. యువత సమస్యలు, సూచనలు, అనుభవాలను నేరుగా తెలుసుకునేందుకు రాహుల్ నేరుగా వారిని కలుస్తున్నార





న్నారు. దేశంలో విద్యా సంస్కరణలు రావా లంటే విద్యార్థుల పోరాటం ఎంతో అవసరమని ఆయన తెలియజేశారు. యువత కలలను సాకారం చేస్తేనే భారత్ ప్రపంచ శక్తిగా ఎదుగుతుందని కాంగ్రెస్ పార్టీ బలంగా విశ్వసిస్తుందన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చే వరకు.. యువతకు సరైన ఉపాధి అవకాశాలు లభించే వరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని.. ఈ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీతో కలిసి నడవాలని ఆయన పిలుపునిచ్చారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నుడా ఛైర్మన్ కేశ వేణు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, సీనియర్ నాయకులు జావీద్ అక్రమ్, ప్రీతం, ముస్తఫా, గోవర్ధన్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగయ్య కీర్తనల 'ఆత్మ విచారం' ఆవిష్కరణ

**అక్షరటుడే, భీమ్‌గల్:** ప్రపంచ ప్రసిద్ధ సంగీత బ్రహ్మ సద్గురు త్యాగరాజ స్వామి కీర్తనల విశిష్టతను తెలిపే అరుదైన గ్రంథం 'త్యాగరాజు ఆత్మవిచారం' మళ్లీ పాఠకుల ముందుకు వచ్చింది. జిల్లాలోని వేల్పూర్ మండలం మోతె గ్రామానికి చెందిన మాయాజూం ఫిలింస్ దర్శకులు అల్లపుల్ల గంగారెడ్డి, తన తండ్రి అల్లపుల్ల రాజులు 8వ వర్ధంతి సందర్భంగా ఈ గ్రంథాన్ని తిరిగి ముద్రింపజేశారు. హైదరాబాద్ కోకాపేట్‌లో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, పారిశ్రామికవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. 1949లో ప్రచురితమైన ఈ అరుదైన తెలుగు గ్రంథం సుమారు 75 ఏళ్లుగా అందుబాటులో లేదు. దీని ప్రాముఖ్యతను గుర్తించిన గంగారెడ్డి, కాశీలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి దీనిని సేకరించి, ఎంతో వ్యయప్రయాసలకోర్చి తిరిగి ముద్రించారు. త్యాగయ్య కీర్తనల్లోని గాఢమైన భక్తి, లోతైన తత్వ చింతనను వచన రూపంలో విశ్లేషించే ఈ పుస్తకం, నేటి తరానికి ఒక నిధిగా నిలుస్తుందని అతిథులు కొనియాడారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. త్యాగరాజ స్వామి జీవితం, భక్తి తత్వం, కీర్తనల్లోని సందేశం నేటి తరానికి చేరా



ల్సిన అవసరం ఉందన్నారు. ఆధ్యాత్మిక గ్రంథాల పునర్ముద్రణ ద్వారా మన సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి, కవి వాడ్రేవు చినవీరభద్రుడు గ్రంథాన్ని పరిచయం చేస్తూ ప్రపంచ సంగీత సాహిత్యాల్లో త్యాగరాజు కీర్తనల గొప్పతనాన్ని వివరించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు మల్లాది రవికుమార్ త్యాగయ్య కీర్తనలను శ్రావ్యంగా ఆలపించి, వాటిలోని భక్తి తత్వాన్ని విశదీకరించారు. నంది అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ ప్రత్యేక అతిథిగా పాల్గొని పాటలు పాడారు. కార్యక్రమంలో కవులు రమణ జీవి, ప్రసాదమూర్తి, వసీరా, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



# జీజీహెచ్ మారదా..?

**నగరంలోని జిల్లా జనరల్ ఆస్పత్రి అసౌకర్యాలకు నెలవుగా మారింది. ఉమ్మడిజిల్లాతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కూడా రోగులు వచ్చే ఈ ఆస్పత్రిలో అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆస్పత్రిలోని లిఫ్ట్‌లు పనిచేయక అత్యవసర పరిస్థితుల్లో రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోగులను ఉంచే హాల్, గదుల్లో టైల్స్ లేచిపోయి నడిచేందుకు అవస్థలు పడుతున్నారు. బాత్‌రూంలు కంపు కొడుతున్నాయి. వెంటనే జీజీహెచ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని రోగులు కోరుతున్నారు.**

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్







## ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**అక్షరటుడే,డిచ్‌పల్లి:** ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.గోపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. బకాయిల విడుదలకై జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు మంగళవారం కళాశాలల బంద్‌ను సక్సెస్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వ పెద్దలు చర్చలు జరిపి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, నేటికీ పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో చదువు పూర్తయిన విద్యార్థులు సర్టిఫికెట్స్ కోసం కళాశాలకు వెళ్తే యజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు.



## ఎన్యూమరేషన్ పత్రాలు పక్కాగా అందజేయాలి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** అర్హులైన ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలు అందజేయాలని డిచ్‌పల్లి తహశీల్దార్ సతీష్ రెడ్డి సూచించారు. మండలంలోని లింగసముద్రం, యానంపల్లి గ్రామాల్లో బూత్ స్థాయిలో ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీని పరిశీలించి సిబ్బందితో మాట్లాడి సూచనలు చేశారు. ఓటరు పేరు, ఇంటి నంబర్, మొబైల్ నంబర్ వంటి వివరాలను నిర్ధారించుకుని ఫారం ఇవ్వాలని, ఫారం ఎలా నింపాలో ఓటరుకు స్పష్టంగా వివరించాలన్నారు. అవసరమైన ధ్రువపత్రాలు (వయస్సు, చిరునామా, గుర్తింపు పత్రాలు మొదలైనవి) జత చేయాలని వివరించారు. ఎవరూ మిగిలిపోకుండా అద్దెదారులు, కొత్తగా వచ్చిన వారు, వృద్ధులు, దివ్యాంగులు వంటి వారిని ప్రత్యేకంగా గుర్తించాలని, ఓటర్లతో మర్యాదగా వ్యవహరించాలని, పూర్తి చేసిన ఫారాలను నిర్ణీత గడువులో సేకరించి సంబంధిత అధికారికి అప్పగించాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచి, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అవసరాలకే ఉపయోగించాలని పేర్కొన్నారు.




విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విశ్వవిద్యాలయాలు తీసుకునే నిర్ణయాలు.. కొన్నిసార్లు వారి కెరీర్‌కు అడ్డంకులు సృష్టిస్తాయనే విమర్శలు ఉన్నాయి. తెలంగాణ యూనివర్సిటీ తాజాగా విడుదల చేసిన బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ ఇప్పుడు అలాంటి వివాదానికి కేంద్ర బిందువుగా మారింది.

- అక్షరటుడే, తెయూ క్యాంపస్

# తెయూ చెలగాటం..

■ ఒకే రోజు నెట్–బీఈడీ పరీక్షలతో గందరగోళం ■ ఆందోళనలో విద్యార్థులు.. ■ పట్టించుకోని వర్సిటీ అధికారులు

జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే నెట్ పరీక్షలు ఈనెల 29 నుంచి ప్రారంభమవుతుండగా.. అదే రోజు తెలంగాణ వర్సిటీ పరిధిలో బీఈడీ నాలుగో సెమిస్టర్ థియరీ పరీక్షలను ప్రారంభించడం విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు దారి తీసింది. ఈ రెండు పరీక్షలు ఒకే రోజు, ఒకే సమయానికి ఉండడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారు. నెట్‌కు నెలల తరబడి సిద్ధమవుతున్న విద్యార్థుల్లో చాలామంది బీఈడీ కూడా చదువుతున్నారు. ఇప్పుడు ఒకే రోజు రెండు పరీక్షలు రావడంతో ఏది రాయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. నెట్ రాస్తే బీఈడీ పరీక్ష కోల్పోవాల్సి వస్తుంది. బీఈడీ రాస్తే జాతీయ స్థాయి అర్హత పరీక్షను వదులుకోవాల్సి ఉంటుంది. దీంతో వారి విద్యా, ఉద్యోగ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

### నెట్‌కు ప్రాధాన్యం.. బీఈడీకి తప్పనిసరి హాజరు

నెట్ పరీక్ష దేశవ్యాప్తంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ సాధించేందుకు నిర్వహించే కీలక పరీక్ష. అలాగే పీహెచ్‌డీ చేసేందుకు నెట్ అవసరం. దీంతో ప్రతి ఏడాది లక్షలాది మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాస్తుంటారు. దీనికి సిద్ధం కావడానికి విద్యార్థులు నెలల తరబడి శ్రమిస్తుంటారు. మరోవైపు బీఈడీ కోర్సు పూర్తి చేయాలంటే నాలుగో సెమిస్టర్ పరీక్షలు తప్పనిసరిగా రాయాలి. ఒక పరీక్ష మిస్ అయితే వెంటనే సప్లిమెంటరీ అవకాశం లేకపోవడంతో మరో ఏడాది వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తద్వారా విద్యార్థులు రెండు వైపులా నష్టపోయే పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

### విద్యార్థుల విజ్ఞప్తిని పట్టించుకోని అధికారులు?

పరీక్షల షెడ్యూల్ విడుదలైన తర్వాత విద్యార్థులు తెలంగాణ వర్సిటీ అధికారులను కలిసి తేదీలను మార్చాలని కోరినట్లు సమాచారం. నెట్ పరీక్ష తేదీలను దృష్టిలో పెట్టుకొని బీఈడీ పరీక్షలను రెండు, మూడు రోజులు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే నెట్ అడ్మిట్ కార్డులు, పరీక్షా కేంద్రాల కేటాయింపు పూర్తయిందని వివరించారు. అనేక మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపినా, అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

### ప్రాక్టికల్స్ కాకముందే థియరీ పరీక్షలు..

విద్యార్థులు వ్యక్తం చేస్తున్న మరో ప్రధాన అభ్యంతరం బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షల నిర్వహణ విధానం పైనే. సాధారణంగా బీఈడీ కోర్సులో స్కూల్ ఇంటర్న్‌షిప్, ప్రాక్టికల్స్, రికార్డుల మూల్యాంకనం పూర్తయ్యాకే థియరీ పరీక్షలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈసారి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించకముందే థియరీ పరీక్షలు నిర్వహించడం విద్యార్థులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రాక్టికల్ పరీక్షల ద్వారా లభించే అనుభవం థియరీ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుందని, అలాంటి అవకాశాన్ని యూనివర్సిటీ దూరం చేస్తోందని విద్యార్థులు విమర్శిస్తున్నారు.

### అవగాహన లోపమా..? సమన్వయ వైఫల్యమా..?

జాతీయస్థాయిలో ముందుగానే ప్రకటించిన నెట్ పరీక్షల షెడ్యూల్‌ను పరిశీలించి ఉంటే ఈ సమస్య వచ్చేదా? అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. యూనివర్సిటీ పరీక్షల తేదీలను ఖరారు చేసే ముందు ఇతర ప్రధాన పరీక్షల క్యాలెండర్‌ను పరిశీలించడం సాధారణ ప్రక్రియ. కానీ ఈసారి అలాంటి సమన్వయం కనిపించలేదని విద్యావర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### పరీక్షల క్యాలెండర్ పాటించడం అత్యవసరం..

వర్సిటీ అధికారులు పరీక్షల షెడ్యూల్ రూపొందించే సమయంలో జాతీయస్థాయి పరీక్షల క్యాలెండర్‌ను పరిశీలించడం అత్యవసరమని విద్యానిపుణులు పేర్కొంటున్నారు. లేకపోతే విద్యార్థులే నష్టపోతారని, పరిపాలనా లోపాల భారాన్ని విద్యార్థులపై మోపడం సరైంది కాదని వారంటున్నారు. తెలంగాణ యూనివర్సిటీ అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని బీఈడీ పరీక్షల తేదీలను పునః సమీక్షించాలని విద్యార్థులు కోరుతున్నారు.

### ఒక తప్పిదం.. ఏడాది నష్టం

బీఈడీ పరీక్ష రాయకపోతే.. కోర్సు పూర్తి, ఫలితాలు ఆలస్యమయ్యే ప్రమాదం నెలకొంది. మరో ఏడాది నిరీక్షణ చేయాల్సిన వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. నెట్ పరీక్ష రాయకపోతే.. అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత కోల్పోయే అవకాశం ఉంది. జేఆర్ఎఫ్ అవకాశం కోల్పోవడం.. మరో నోటిఫికేషన్ వరకు నిరీక్షణ తప్పదు. రెండు పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైనవి కావడంతో అయోమయం నెలకొంది. అధికారులు స్పందించి పరీక్షలను వాయిదా వేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



## గంగాజలంతో దేవతామూర్తులకు అభిషేకం

**అక్షరటుడే, ఆర్మూర్ :** మండల కేంద్రంలో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో గంగాజలంతో దేవతామూర్తులకు అభిషేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వీడీసీ అధ్యక్షుడు సూర్య మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆనవాయితీగా రెండుసార్లు గంగాజల అభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతుల పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ అభిషేకాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కెర విజయ్, వార్డ్ సభ్యులు ,గ్రామ పెద్దలు, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మాణికం ఠాకూర్‌కు శుభాకాంక్షలు తెలిపిన మానాల

**అక్షరటుడే, ఇందూరు:** తమిళనాడు పీసీసీ అధ్యక్షుడిగా పార్లమెంట్ సభ్యుడు మాణికం ఠాగూర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా.. ఢిల్లీలోని వారి నివాసంలో తెలంగాణ రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. మాణికం ఠాకూర్ సమర్థ నాయకత్వంలో తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. మానాల వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు గున్నల వెంకటేష్ గౌడ్ తదితరులున్నారు.




## వర్షంలోనే కూరగాయల విక్రయాలు

కామారెడ్డి పట్టణంలో వెజిటబుల్ మార్కెట్ లేకపోవడంతో కూరగాయలు విక్రయించే వారు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు కూరగాయలు అమ్ముకోవడానికి సరైన స్థలం లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మొదలుకుని సుభాష్ రోడ్డులో ఆదివారం కూరగాయలు విక్రయిస్తున్నారు. కామారెడ్డి పట్టణంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో వర్షంలో తడుస్తూ విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కూరగాయల మార్కెట్ నిర్మించాలని కోరుతున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి

## పారదర్శక ఓటరు జాబితా కోసమే ఎస్ఐఆర్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ చేపట్టిందని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఎల్లారెడ్డిలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 252లో బీఎల్‌వో ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ ప్రక్రియను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పారదర్శకమైన ఓటరు జాబితా ఎంతో అవసరమన్నారు. ఎస్ఐఆర్ సర్వే కోసం ఇంటింటికి వచ్చే బీఎల్‌వోలకు ప్రతిఒక్కరూ పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సరైన సమాచారం ఇచ్చి నకిలీ ఓట్లు, డూప్లికేట్ ఓట్లు లేని జాబితా తయారీకి తోడ్పడాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, తప్పుల సవరణ వంటివి ఈ సర్వేలో చేపడతారని వివరించారు. కార్యక్రమంలో బీఎల్‌వో స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ..

**అక్షరటుడే, భీమ్‌గల్:** మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు, దివంగత పీవీ నరసింహారావు దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ అన్నారు. పట్టణంలో పీవీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశానికి పీవీ నరసింహారావు చేసిన విశేష సేవలను కొనియాడారు. దక్షిణ భారతదేశం నుంచి, మరీ ముఖ్యంగా తెలుగు గడ్డ నుంచి వెళ్లి దేశ ప్రధానిగా అత్యున్నత బాధ్యతలు చేపట్టిన గొప్ప రాజనీతిజ్ఞుడు పీవీ అని కీర్తించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




ఆర్మూర్ లో..


బోధన్‌లో..


నగరంలోని 21 వ డివిజన్‌లో..


గాంధారిలో..


కామారెడ్డిలో..

## విజయవంతంగా పల్స్‌పోలియో

ఉమ్మడిజిల్లాలో జాతీయ పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమైన ప్రాంతాల్లో వైద్యశాఖ బూత్‌లను ఏర్పాటు చేసింది. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వలంటీర్లు ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఉన్నతాధికారులు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్


రెంజర్ల గ్రామంలో..


ఎల్లారెడ్డిలో..


ఆర్మూర్‌లోని హౌసింగ్ బోర్డులో..


భీమ్‌గల్ లో..